RNI : APTEL/2012/52025

ది సిద్ధిపేట టైమ్స్

తెలుగు దినపత్రిక

thesiddipettimes2012@gmail.com

THE SIDDIPET TIMES TELUGU DAILY

సిద్ధిపేట(మెదక్) | 2025, జూన్ 20 శుక్రవారం | ఎడిటర్ : లోక రవిచంద్ర | సంపుటి:13 | సంచిక:261 | పేజీలు : 4 | వెల : 2/-

సిద్ధిపేట బీజేపీలో రచ్చరచ్చ

జిల్లా అధ్యక్షుడి నియామకం అక్రమమని తేల్చిన కేంద్ర కమిటీ

- మార్చాలన్న అభిప్రాయం
- పట్టించుకోని రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి
- దేశవ్యాప్తంగా 12 చోట్ల అక్రమాలు జరిగాయని గుర్తింపు
- సిద్ధిపేట, మెదక్ అధ్యక్షులను తొలిగించాలని సూచించిన భారత ఎన్నికల సంఘం
- పార్టీ వీడుతామంటున్న శ్రేణులు
- ఈటల రాజేందర్ జోక్యంపై ఆగ్రహం

(సెంట్రల్ డెస్క్, ది సిద్ధిపేట టైమ్స్)

ఉమ్మడి మెదక్ జిల్లాలో బీజేపీ జిల్లా అధ్యక్షుల ఎంపిక అంశం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మెడకు చుట్టుకుంటున్నది. సిద్ధిపేట, మెదక్ జిల్లా అధ్యక్షుల ఎన్నిక నియమ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందన్న ఆరోపణలపై పార్టీ కేంద్ర కమిటీ స్పందించి స్పష్టమైన ఆదేశాలిచ్చినా రాష్ట్ర కమిటీ కేర్ చేయకపోవడం ఇప్పుడు కార్యకర్తల ఆగ్రహానికి కారణమవుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ కమిటీల ఏర్పాటు కోసం ఎన్నికల అధికారిగా మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణను నియమించాక మూడు నెలలు కసరత్తు చేసి నాలుగు విడతల్లో జిల్లాల అధ్యక్షులను నియమించారు. పలు జిల్లాల్లో అధ్యక్షుల నియామకాపై అసంతృప్తి వ్యక్తమైనా సిద్దపేట, మెదక్ జిల్లా అధ్యక్షుల ఎంపికపై నిరసన జ్వాలలు వెల్లువెత్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా అధ్యక్షుల ఎంపికలో ఆయా ప్రాంతాల బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీల అభిప్రాయం ఎన్నికల కమిటీ తీసుకున్నది. తర్వాత తలెత్తిన అసంతృప్తిని కూడా నివారించడానికి వారే జోక్యం చేసుకున్నారు. కానీ సిద్ధిపేట, మెదక్ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన ఖైరి శంకర్ ముదిరాజ్, మల్లేశం గౌడ్ ఎన్నికపై తలెత్తిన వివాదాన్ని సద్దుమణిగేలా చేయడం ఎవరి తరమూ కావడం లేదు. ఇందుకు కారణం జిల్లాకు సంబంధం లేని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ జోక్యమే అన్న ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి.

ఈటల జోక్యం

హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న ఈటల రాజేందర్ కేసీఆర్ తో విభేధించాక బీజేపీలో చేరి ఉపఎన్నికలో తిరిగి ఎన్నికయ్యారు. కేసీఆర్ ను ఎలాగైనా దెబ్బతీయాలన్న లక్ష్యంతో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ తో పాటు గజ్వేల్ నుంచి కూడా బీజేపీ తరపున పోటీ చేశారు. ఫలితం తిరగబడి రెండు చోట్లా ఓటమి చవిచూడాల్సి వచ్చింది. ఆ తర్వాత వచ్చిన లోకసభ ఎన్నికల్లో మెదక్ నుంచి పోటీ చేయాలని ఈటల చేసిన ప్రయత్నానికి ఇక్కడి బీజేపీ శ్రేణులు గండి కొట్టారు. అత్యధికులు ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించడంతో కేంద్ర కమిటీని ఒప్పించుకుని మల్కాజిగిరి స్థానం నుంచి పోటీ చేసి గెలిచారు. మెదక్ ఎంపీగా మాధవనేని రఘునందన్ రావు విజయం సాధించారు. ఆ తర్వాత జిల్లాల బీజేపీ అధ్యక్షుల ఎంపికలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. మెదక్ పార్లమెంటరీ పరిధిలోని సిద్ధిపేట, మెదక్ జిల్లా అధ్యక్షుల ఎంపికలో నియమ నిబంధనలు పాటించలేదని స్పష్టమైంది. జిల్లాల అధ్యక్షులుగా ఎంపికైన ఖైరి శంకర్ ముదిరాజ్, మల్లేశం గౌడ్ పార్టీలో చేరి ఎక్కువ కాలం కూడా కాకపోవడమే ఈ వివాదానికి కారణం. అసెంబ్లీ ఎన్నికల ముందు ఈటల రాజేందర్ అనుయాయులుగా బీజేపీలో చేరారు. పార్టీ పదవులు అలంకరించాలంటే పాటించాల్సిన నిబంధనలేవీ చూడకుండా బైపాస్ లో వారికి సిద్ధిపేట, మెదక్ అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టారన్న ఆరోపణలొచ్చాయి. షార్ట్ లిస్టులో ఉన్న ముగ్గురిని కాదని అప్పటికప్పుడు నామినేషన్ తీసుకుని వారిని జిల్లాల అధ్యక్షులుగా చేశారన్న విమర్శలొచ్చాయి.

కేంద్ర కమిటీ ఆదేశాలు బేఖాతరు

అడ్డదారిలో సిద్ధిపేట, మెదక్ జిల్లాల అధ్యక్ష పదవులు కట్టబెట్టారన్న నిరసనలు వెల్లువెత్తాయి. కార్యకర్తలు భారీ ఎత్తున హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి తరలి వచ్చి నిరసన తెలిపారు. వారిని తక్షణమే పదవుల నుంచి తొలిగించాలని డిమాండ్ చేశారు. దాంతో పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రశేఖర్ జోక్యం చేసుకుని వారిని సముదాయించారు. ఫిర్యాదులను కేంద్ర కమిటీ పరిశీలనకు పంపించి వారి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అప్పటి వరకు త్రీమెన్ కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర కమిటీ పంపిన నివేదికను కేంద్ర బీజేపీ ఎన్నికల కమిటీ పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా సిద్ధిపేట, మెదక్ జిల్లాల అధ్యక్షుల ఎంపిక జరిగిందని తేల్చింది. వారిని తొలిగించాలని ఆదేశించింది. కానీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఎలాంటి నిర్ణయమూ తీసుకోకుండా కేంద్ర కమిటీ ఆదేశాలను తొక్కి పెట్టారు. ఈ క్రమంలో వీరి ఎంపిక అక్రమమంటూ భారత ఎన్నికల సంఘానికి ఫిర్యాదు వెళ్లింది. సిద్ధిపేట, మెదక్ తో పాటు దేశవ్యాప్తంగా మొత్తం 12 జిల్లాల్లో అడ్డదారి నియామకాలు జరిగినట్లు తేలింది. అక్రమంగా ఎన్నికైన వారిని తొలిగించాలని భారత ఎన్నికల సంఘం వెంటనే స్పందించి బీజేపీ జాతీయ కార్యవర్గానికి సూచించింది. అయినప్పటికీ తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆ ఆదేశాలను పక్కన పెట్టారు.

కిషన్ రెడ్డి జంకుతున్నదెవరికి

బీజేపీ కేంద్ర కమిటీ ఆదేశాలను కూడా అమలు చేయకపోవడంలో రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని ఎవరు ప్రభావితం చేస్తున్నారన్న ప్రశ్న ప్రస్తుతం సిద్ధిపేట, మెదక్ జిల్లా బీజేపీ శ్రేణులను తొలుస్తున్నది. ఇటీవల రెండోసారి రాష్ట్ర బీజేపీ కార్యాలయాన్ని సిద్ధిపేట నాయకులు, కార్యకర్తలు ముట్టడించి అగ్రనాయకత్వాన్ని నిలదీశారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రశేఖర్ మరోసారి సముదాయించి పంపించినా పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి సెగలు ఆగలేదు. అడ్డదారిలో అధ్యక్షులుగా ఎంపికైన వారి కారణంగా జిల్లాలో బీజేపీకి తీవ్ర నష్టం వాటిల్లేలా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం పడనుందని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర అధినాయకత్వం వెంటనే నిర్ణయం తీసుకోకుంటే భారీ ఎత్తున కార్యకర్తలు, నాయకులు పార్టీని వీడక తప్పదని స్పష్టం చేస్తున్నారు.

పేదల అభ్యున్నతికి బీజేపి కృషి

మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

- ఎన్డీఏ హాయంలో దేశం సర్వతోముఖాభివృద్ధి

(చేర్యాల, ది సిద్ధిపేట టైమ్స్):ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలన పేదల అభ్యున్నతికి, సంక్షేమానికి ప్రతిరూపమని ఆ పార్టీ విశ్వకర్మ యోజన రాష్ట్ర కన్వీనర్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ పేర్కొన్నారు. వికసిత భారత్ అమృత్ కాల్ సేవా కార్యక్రమంలో భాగంగా 11సంవత్సరాల సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా చేర్యాల మండల కేంద్రంలో బుధవారం బీజేపి సిద్ధిపేట జిల్లా ఉపాధ్యక్షులు బూరుగు సురేష్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి బూర నర్సయ్య గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. మోదీ సారధ్యంలో దేశం అన్నిరంగాలో ముందుకు దూసుకువెళ్తున్నదన్నారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి విపాయం ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నాయని దయబట్టారు. డబుల్ ఇంజన్ సర్కార్ సత్తా ఏమిటో చూపిస్తున్నామన్నారు. అభివృద్ధిలో మన దేశం జపాన్ ను అధిగమించి నాలుగు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని అన్నారు. దేశంలో 81 కోట్ల మంది పేదలకు ఉచిత రేషన్ అందిస్తున్న ఘనత మోదికే దక్కుతుందన్నారు. దేశానికి పట్టుకొమ్మలైన గ్రామీణ ప్రాంతాలలో గ్రామీణ మహిళల ఆత్మ గౌరవాన్ని కాపాడటం కోసం ప్రతి ఇంటికి మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టారని, ఇంట్లో అమ్మలు కట్టెల పొయ్యి మీద వంట చేయడానికి ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఉజ్వల యోజన పథకాన్ని తీసుకొచ్చి వారి కష్టాలను దూరం చేయడం జరిగిందని సూచించారు. రైతుల కోసం ఫసల్ బీమా యోజన, కిసాన్ సమృద్ధి యోజన లాంటి పథకాలు తీసుకొచ్చారని ఆయన పేర్కొన్నారు. అన్నార్థుల ఆకలి తీర్చి పేదలకు ఆవాసం కల్పించి ప్రతీ ఇంటికి తాగునీరు అందించి ఎంతోమందికి స్వయం ఉపాధిని చూపించిన పేదల పెన్నిది నరేంద్ర మోదీ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి, పట్టణ అధ్యక్షులు కర్క తిరుపతి రెడ్డి, మండల అధ్యక్షులు సంజీవులు, నర్ర మహేందర్ రెడ్డి, కాశెట్టి పాండు, గుస్కా రాందాస్, బాల్ నర్సు, సిద్ధారెడ్డి, కృష్ణ రెడ్డి, ప్రవీణ్, రాజు, షాదుల్ల, వడ్డే చంద్రమౌళి, శ్రీనివాస్, బిక్షపతి రెడ్డి, నవీన్, సిద్దులు, తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ ప్రతినిధులకు నోటీసులు

డీఎంహెచ్ ఓ పల్వన్ కుమార్

- ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేసే అధికారం ఐఎంఏకు లేదు

(గజ్వేల్, ది సిద్ధిపేట టైమ్స్): ఈనెల 18న గజ్వేల్ లోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులపైన ఆకస్మిక దాడులు నిర్వహించిన ఐఎంఏ అసోసియేషన్ ప్రతినిధులు, డాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ బి. పల్వన్ కుమార్ తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులపైన తనిఖీ నిర్వహించే అధికారాలు ఐఎంఏ ప్రతినిధులకు గానీ, డాక్టర్లకు లేవని, ఇకముందు ఐఎంఏ ప్రతినిధులు గానీ డాక్టర్లు గానీ దాడులు నిర్వహించినట్టయితే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ ఆసుపత్రి యజమాన్యాలు, ఇకముందు ఐఎంఏ ప్రతినిధులు ఒకవేళ ఆసుపత్రుల పైన దాడులకు పాల్పడితే వెంటనే డీఎంహెచ్ఓకు సమాచారాన్ని అందించాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రుల పైన, స్కానింగ్ సెంటర్ల పైన, పర్యవేక్షించే అధికారాలు కేవలం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు మాత్రమే ఉంటుందని, ఈ విషయాన్ని ప్రైవేట్ ఆస్పత్రుల యజమాన్యాలు గమనించాలని తెలిపారు.

బేసిన్‌పై బేసిక్ నాలెడ్జి లేదు

సీఎంపై హరీశ్ రావు ఫైర్

(హైదరాబాద్, ది సిద్ధిపేట టైమ్స్): ఏ ప్రాంతం ఏ నది బేసిన్ లో ఉందన్న బేసిక్ నాలెడ్జి కూడా సీఎం రేవంత్ రెడ్డికి లేదని కానీ బ్యాగుల విషయం మాత్రం బాగా తెలుసని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బనకచర్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకే సీఎం రేవంత్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పెట్టినట్లు ఉందని ఆరోపించారు. బుధవారం బనకచర్ల ప్రాజెక్టుపై ప్రభుత్వం అఖిలపక్ష ఎంపీలతో నిర్వహించిన సమావేశంపై హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. గోదావరి నీటిలో 968 టీఎంసీలు తెలంగాణ హక్కని చెప్పారు. వెయ్యి టీఎంసీలు కావాలని చంద్రబాబును అడగటం ఏంటని ప్రశ్నించారు. కృష్ణాలో 763 టీఎంసీలు కోసం వాదిస్తుంటే.. 500 టీఎంసీలు అడగటమేంటని నిలదీశారు. ఆంధ్ర జలదోపిడీని అడ్డుకోమంటే సీఎం అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఏపీ, తెలంగాణకు మేలు జరిగేలా ప్రాజెక్టులు రూపొందించాలని కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. తెలంగాణను సంప్రదించకుండా నదుల అనుసంధానంపై ముందుకెళ్లవద్దని సూచించారు. గోదావరి జలాలను సాగర్ నుంచి శ్రీశైలంకు తీసుకురావాలని జగన్‌తో కేసీఆర్ చెప్పారు. సాగర్, శ్రీశైలం ద్వారా అయితే తెలంగాణకు లాభమని కేసీఆర్ భావించారు. జగన్ అంగీకరించకపోవడంతో ఆ ప్రతిపాదన ముందుకు పోలేదని హరీశ్ రావు చెప్పారు.

కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి

ఆర్థిక సాయంతో కుటుంబాన్ని ఆదుకున్న క్లాస్ మేట్స్

(సిద్ధిపేట రూరల్, ది సిద్ధిపేట టైమ్స్):కిడ్నీలు దెబ్బతిని మృత్యువాత పడ్డ చిన్ననాటి మిత్రుని కుటుంబానికి మిత్రులు ఆర్థికసాయం చేశారు. సిద్ధిపేట జిల్లా పుల్లూరుకు చెందిన రామగళ్ళ భగవాన్ రెండు కిడ్నీలు ఫెయిల్యూర్ కావడంతో 15 సంవత్సరాల నుండి డయాలసిస్ చేయించుకుంటన్నారు. కొన్ని రోజుల నుండి వ్యాధి ముదిరి బుధవారం మృతి చెందాడు. వాట్సాప్ గ్రూపులలో భగవాన్ మృతి చెందిన వార్త తెలియడంతోతన తోటి తొగుట సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో 2007 2009 ఇంటర్మీడియట్ చదువుకున్న మిత్రులు స్పందించారు. మిత్రులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. వెంటనే మిత్రుని సొంత గ్రామానికి హుటా హుటిన వెళ్లి అంతక్రియలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు స్నేహితులు మాట్లాడుతూ... ఈ లోకంలో స్నేహానికి మించిన బంధం మరొకటిలేదని, అందరితో మమేకమై కలివిడిగా కష్టసుఖాలను పాలుపంచుకునే ఆప్త మిత్రుడు దూరమవ్వడం చాలా బాధాకరమన్నారు. భౌతికంగా మా మధ్య లేకపోయినా అతని భావాలు మాపై చూపించిన ఆదారాభిమానాలు ఏనాటికి చెరగని స్మృతులుగా మా మధ్య మెదలాడుతూనే ఉంటాయని చెప్పారు. మిత్రునికి ఇంత చిన్న వయసులో రెండు కిడ్నీలు ఫెయిల్ కావడంతో మేము ఎంతో బాధపడ్డాం. గత 15 సంవత్సరాల నుండి డయాలసిస్ చేయించుకుంటూ ఉండేవారు.. కానీ ఇప్పుడు మిత్రుడు లేడు అనేది మేము జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. మిత్రులు చలించిపోయి వాట్సాప్ వేదికగా ఒకరికొకరు చర్చించుకుని ఎలాగైనా స్నేహితుని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించుకుని చేయి చేయి కలిపి చేతనైనంత ఆర్థిక సాయాన్ని చేయాలని నిర్ణయించుకొని జమచేసి రూ.13 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆ కుటుంబానికి ముందు ముందు కూడా మరింత ఆర్థిక సాయం అందించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్

ఆకునూరు ఎంపీపీఎస్ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

(చేర్యాల, ది సిద్ధిపేట టైమ్స్): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి మంచిస్థాయికి చేరుకోవాలని ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు మేడిచెల్మి అయోధ్య, జడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం అయిలయ్య అన్నారు. చేర్యాల మండలం ఆకునూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎంపీపీఎస్ విద్యార్థులకు గురువారం 380 నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి పేదరికాన్ని అధిగమించి విద్యలో రాణించినప్పుడే భవిష్యత్ ఉజ్వలమవుతుందన్నారు. దాతలు ఇస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అర్హతల గలిగిన ఉపాధ్యాయులచే చక్కటి విద్యా బోధన పొందుతారని అన్నారు. అన్ని దానాల కన్న విద్యా దానం గొప్పదని నోట్ బుక్స్ అందజేసిన ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్ హైదరాబాద్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ తోళ్ల రాజేశ్వరి, ఏఏపీసి సభ్యులు అందే అశోక్, ఫ్రెండ్స్ హెల్పింగ్ అండ్ అసోసియేషన్ అధ్యక్షులు అవధూత ఆనంద్ రావు, ఉపాధ్యక్షులు స్వర్గం జగన్మోహన్, సభ్యులు ఉళ్ళెంగల లక్ష్మీపతి, నరేష్, మల్లేశం, పాఠశాల పూర్వ ఉపాధ్యాయుడు తాటికొండ యాదయ్య, పాఠశాల ఉపాధ్యాయులు శ్యాంసుందర్ రెడ్డి, సమ్మయ్య, ప్రేమ్ కుమార్, రాజయ్య, రాధాబాయి, సరోజినీ దేవి, భవాని, శాశ్వత దాత నాగమల్ల సాయికుమార్, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ కోతి ఆంధ్రయ్య, గ్రామస్తులు కిష్టయ్య, లక్ష్మారెడ్డి, నర్సింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

(చేర్యాల, ది సిద్ధిపేట టైమ్స్): మద్యానికి బానిసైన వ్యక్తి మద్యం మత్తులో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నీరేష్ తెలిపిన వివరాల ప్రకారం పోతిరెడ్డిపల్లికి చెందిన మహమ్మద్ జాఫర్ (44) అనే వ్యక్తి మత్తుకు బానిసై ప్రతిరోజు మద్యం సేవించేవాడు. రోజు మాదిరిగా మద్యం తాగిన అనంతరం తన భార్యతో గొడవ పెట్టుకుని మనస్థాపానికి గురైన జాఫర్ మద్యం మత్తులో గురువారం చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జాఫర్ భార్య ఫిర్యాదుతో ఎస్ఐ నీరేష్ సంఘటన స్థలానికి చేరుకొని జాఫర్ ఆత్మహత్య కు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. జాఫర్ కు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉందని మృతిని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నీరేష్ తెలిపారు.

సినీ కళాత్మృష్ణ రేపల్లె రామకృష్ణ

- చిరంజీవి, రవితేజలే స్ఫూర్తి
- టీవీ, సినిమాల్లో రాణిస్తున్న రామకృష్ణ

వెండితెరపై ఓ వెలుగు వెలగాలని కోరుకోని కళాకారుడు ఉండడు. చిన్నప్పటి నుంచి చిరంజీవి డ్యాన్సును చూస్తూ మాస్ మహరాజా రవితేజ చలాకీతనాన్ని ఫాలో అవుతూ పెరిగిన రామకృష్ణ కూడా వెండితెర కలలే కన్నాడు. తెలంగాణలో సినిమాలకు రెండో కేంద్రంగా ఎదుగుతున్న కరీంనగర్ గడ్డపై పుట్టిన రామకృష్ణకు సహజంగానే సినిమాల పట్ల ఆసక్తి పెరిగింది. ఊరికే అవకాశాలు వస్తాయని ఎదురుచూడలేదు. చుట్టాల పెళ్లి జరిగినా దోస్తుల దావత్ లైనా.. ఏదీ వదలకుండా తనలోని కళాకారున్ని బయటపెట్టేవాడు. అతన్ని దగ్గరి నుంచి గమనించిన వారంతా అతనిలో ఏదో ప్రత్యేకత ఉందని మాత్రం గుర్తించారు. గో అహెడ్ అంటూ భుజం తట్టారు. అది రామకృష్ణకు మరింత ఉత్సాహాన్నిచ్చింది. నటనకు మెరుగులు దిద్దాడు.. డ్యాన్సుకు పదునుపెట్టాడు. చిన్నా పెద్దా అని కాకుండా వచ్చిన ప్రతి అవకాశాన్ని తనలోని కళాకారుడిని సంతృప్తి పరచడానికి ఉపయోగించాడు. షార్ట్ ఫిల్ములు, టీవీ సీరియళ్లు, సినిమాలంటూ క్రమంగా అవకాశాలను సృష్టించుకుంటూ ఎదుగుతున్న రేపల్లె రామకృష్ణతో ది సిద్ధిపేట టైమ్స్ మాటామంతి..

-లోక శ్రీనివాస్
బ్యూరో చీఫ్, ది సిద్ధిపేట టైమ్స్

బాల్యం నుంచే నటనపై ఆసక్తి

టైమ్స్ : సినిమాల పట్ల ఆసక్తి ఎలా కలిగింది.

రామకృష్ణ : చిన్నపటి నుండి కూడా టీవీలో సినిమాలు, డాన్స్ లు చూసేవాడిని.. కష్టపడి డాన్స్ బేసిక్స్ నేర్చుకున్నాను. సినిమా అంటే క్రేజీగా, గొప్పగా ఫీల్ అయ్యేవాన్ని. ఆర్టిస్టులకు వచ్చే ప్రజాదరణ నన్ను ఆకర్షతుడిని చేసింది.

టైమ్స్ : స్ఫూర్తి ఎవరు.

రామకృష్ణ : కాలేజీ కాలేజీ ఫేర్ వెల్, మిత్రుల ఇళ్లల్లో శుభకార్యాలు, గెట్ టుగెదర్ లాంటి వాటిల్లో డాన్స్ చేస్తుంటే ఎంతో ప్రోత్సహించే వారు. అది నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చేది. కెమెరా ముందుకు వెళ్ళినప్పటి నుండి నిన్ను టీవీ సీరియల్/సినిమాలో స్క్రీన్ పైన చూసాం అంటే నా సంతోషానికి అవధులు లేకుండా ఉప్పొంగి పోతుంటాను. మెగాస్టార్ చిరంజీవి గారు, మాస్ మహారాజ రవితేజ గారు, నాకు ఆదర్శం, "కష్టే ఫలి" అని నమ్మిన వారి సిద్ధాంతాన్నే నేను కూడా నమ్ముతాను.

టైమ్స్ : ప్రోత్సాహం దొరికిందా..

రామకృష్ణ : అదృష్టవశాత్తు నాకు నా కుటుంబ సభ్యులనుండి ఎంతో ప్రోత్సాహం లభించింది, ఈ విషయం లో నేను అదృష్టవంతుడను. ఇండస్ట్రీ లో కూడా నా మిత్రులు కొందరు ప్రత్యక్షంగా, పరోక్షంగా కూడా నా వెన్ను తట్టి నిలుచున్నారు, వాళ్లందరికీ కృతజ్ఞతలు.

టైమ్స్ : ఆనందం కలిగించేవి..బాధ అనిపించే ఘటనలు..

రామకృష్ణ : నన్ను చిన్న చూపు చూసిన వారు, దూరంగా పెట్టినవారు కూడా ఇప్పుడు ఏమి ప్రాజెక్ట్స్ చేస్తున్నావు అని పలకరిస్తుంటారు. ఇది చాలా సంతోషాన్నిస్తున్నది. ఒకే సారి రెండు ప్రాజెక్ట్స్ దొరకడం..అందులో డేట్లు క్లాష్ అవ్వడం, లుక్ డిఫరెన్స్, క్యారెక్టర్ ఫిట్ నెస్ తేడాలతో కొన్ని మిస్సవుతుండటం బాధకలిగిస్తున్నది. ఇవన్నీ ఇండస్ట్రీలో మామూలే.

టైమ్స్ : నటన కాకుంటే ఇంకే రంగంలో స్థిరపడేవారు.

రామకృష్ణ : చిన్నప్పటి నుండి న్యాయవాద కోర్స్ అంటే ఇష్టం.. కానీ అది వీలుపడలేదు. కానీ ఆ తరువాత ఇష్టపడింది మట్టుకు సినిమానే.. ఉపాధి కోసం మెడికల్ రిప్రెసెంటేటివ్ గా పనిచేశాను. కానీ నా మనసంతా సినిమాల మీదే ఉండేది. అంతే రెండో ఇష్టాన్ని మొదటి ప్రాధాన్యంగా ఎంచుకున్నాను. ఇప్పుడు ఫుల్ టైం సినిమాలకే కేటాయిస్తున్నాను.

టైమ్స్ : సినీ ప్రయాణం ఎలా సాగుతున్నది .

రామకృష్ణ : ప్రతి ప్రొఫెషన్ లో లాగా సినిమా ఇండస్ట్రీలో కూడా ఎన్నో ఒడిదుడుకులు ఉంటాయి. కాస్త నిగ్రహం, ఓర్పు, సహనం తప్పనిసరి. ఎన్నోసార్లు ఓటమిని, అవమానాలను చూస్తూ, అధైర్యపడకుండా ఏదో ఒక రోజు నా టైమ్ వస్తుంది అని పాజిటివ్ అటిట్యూడ్ తో ముందుకు వెళితే విజయం తప్పక వరిస్తుందని నా అభిప్రాయం.

టైమ్స్ : సినిమారంగంలో రాణించడానికి ఏం చేస్తున్నారు.

రామకృష్ణ : నటనను సానపడుతుండడం, ఆరోగ్యంగా, ఫిట్ గా, ఆత్మవిశ్వాసంతో ఉండడం, అన్నింటికీ మించి సమయపాలన, క్రమశిక్షణ, కమ్యునికేషన్, సంబంధాలు కొనసాగించడం అనేది చాలా అవసరం. మా నాన్న గారికి డాన్స్, పాటలు అంటే ఎంతో ఇష్టం. తన ఇంట్రస్ట్ నాకు కూడా ఆదర్శప్రాయమైనది.

ఇదీ నాగురించి..

పేరు: రామకృష్ణ రేపల్లె
చదువు : ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంబీఏ
స్వస్థలం: జగిత్యాల
నటుడుగా : అమృతం(మొదటి సీరియల్), హ్యాపీ డేస్ మొదలైన సీరియళ్లు.
సినిమాలు: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు(మొదటి సినిమా), క్షణం, ఘాజి, స్పైడర్, పైలం పిల్లగా, విందు భోజనం మొదలైనవి.
వెబ్ సిరీస్ లు: లూజర్, ధూత.
బాగా పేరొచ్చింది.. పిజ్జా 2018 తెలుగు షార్ట్ ఫిల్మ్ 5 మిలియన్ వ్యూస్ క్రాస్ చేయడం ఎంతో తృప్తిని, ఆనందిన్నిచ్చింది.
కొత్త ప్రాజెక్టులు: 4 సినిమాలు నిర్మాణ దశలో ఉన్నాయి.

రాజకీయ ప్రయోజనాలే తప్ప... రాష్ట్ర ప్రయోజనాలు పట్టవా?

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ

(సిద్ధిపేట టౌన్, ది సిద్ధిపేట టైమ్స్): అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ గా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మారిపోయారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ, నాయకులు పాల సాయిరాం అన్నారు. సిద్ధిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ...రేవంత్ రెడ్డికి రాజకీయ ప్రయోజనాలే తప్ప తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు పట్టవన్నారు. మోకాలికి బోడిగుండుకు ముడిపెడుతూ ప్రతి విషయంలో అబద్ధాలే మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం కుర్చీ కాపాడుకోవడానికే తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేయడం లేదని వారు విమర్శించారు. నల్లమల ఎక్కడుందో తెలియని వ్యక్తి తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉండడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం అన్నారు. గతంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ లో కేసీఆర్ మాట్లాడిన మాటలను దురుద్దేశపూర్వకంగా రేవంత్ రెడ్డి వక్రీకరిస్తున్నాడని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రనీటి వాటాను కాపాడే తపన రేవంత్ రెడ్డికి ఏమాత్రం లేదన్నారు. తెలంగాణ ప్రాంతం మీద కేసీఆర్ కు ఉన్నంత ప్రేమ కొంచెమైనా రేవంత్ రెడ్డికి లేదన్నారు. ఎన్నికల సమయంలో మాయ మాటలు, అబద్ధాలు చెప్పి ప్రజలను ఏమార్చి అధికారంలోకి వచ్చారు తప్ప, రేవంత్ రెడ్డిని ఎవరూ విశ్వసించలేదన్నారు. హరీశ్ రావును తలకాయ ఎక్కడ పెట్టుకుంటావు అని అడిగిన రేవంత్ రెడ్డి కాళేశ్వరం ద్వారా పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉన్న తెలంగాణను చూసి నీ తల ఎక్కడ పెట్టుకుంటావో ప్రజలకు చెప్పాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు పాల సాయిరాం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని మోదీ, చంద్రబాబుల డైరెక్షన్లోనే నిన్న ప్రెస్ మీట్ జరిగిందన్నారు. అఖిలపక్ష సమావేశానికి ఎమ్మెల్యేలకు అవకాశం కల్పిస్తే హరీశ్ రావు, కేటీఆర్ లు అడిగే ప్రశ్నలకు తాము సమాధానం చెప్పలేమనే భయంతోనే అఖిలపక్షం సమావేశానికి ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ పక్కన పెట్టి రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేయాలని సూచించారు. అప్పు కోసం వెళితే చెప్పులు ఎత్తుకు పోయే వాడిలా చూస్తున్నారు అని చెప్పి తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ ను రేవంత్ రెడ్డి దెబ్బతీశారని, ఇప్పటికైనా ఆరోపణలు, విమర్శలు మానుకొని ప్రజారంజక పాలన చేయాలని హితవు పలికారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాణిక్య రెడ్డి, సోమిరెడ్డి, మోహన్ లాల్, ఎల్లారెడ్డి, ఆంజనేయులు, కనకరాజు, యాదగిరి, రమేష్, సాయి చరణ్, ప్రశాంత్ పలువురు పాల్గొన్నారు.

శకునిలా మారిన మైనంపల్లి

- గజ్వేల్ కాంగ్రెస్ నేతల ఆగ్రహం
- మల్కాజిగిరిలో చెల్లని రూపాయి గజ్వేల్ లో చెల్లుతుందా...?
- ఎంపీ ఎన్నికల్లో...గజ్వేల్ లో కాంగ్రెస్ కు పెరిగిన ఓట్లు మెదక్ లో తగ్గడానికి కారణమేమిటి...?
- సిద్ధిపేట జిల్లాలో గ్రూపులను ప్రోత్సహిస్తున్న మైనంపల్లి
- మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తే సహించం

(గజ్వేల్, ది సిద్ధిపేట టైమ్స్): కాంగ్రెస్ పార్టీలో మైనంపల్లి హన్మంతరావు శకునిలా మారి గ్రూపు రాజకీయాలు ప్రోత్సహిస్తూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని గజ్వేల్, కొండపాక, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ మోహన్, వైస్ చైర్మన్లు సర్దార్ ఖాన్, ప్రభాకర్ గుప్త, పరశురాం తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు... గజ్వేల్ తో పాటు సిద్ధిపేట జిల్లాలో గ్రూపు రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారి నామినేటెడ్ పోస్టుల భర్తీకి అడ్డం పడుతున్నట్లు ఆరోపించారు. పార్టీ బలోపేతానికి కష్టపడిన కార్యకర్తలను కాకుండా కొందరిని ప్రోత్సహిస్తూ కోటరీ ఏర్పాటు చేసుకున్నట్లు విమర్శించారు. ముఖ్యంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేయడం తగదని చెప్పారు. మల్కాజిగిరిలో చెల్లని రూపాయి ఇక్కడ ఎలా చెల్లుతుందని ఎద్దేవా చేశారు. అయితే ఎంపీ ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గంలో 32971 ఓట్లు పెరగగా, మెదక్ లో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నచోట 31538 ఓట్లు ఎందుకు తగ్గాయో ఆయన చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే తన నియోజకవర్గం మల్కాజ్గిరి లో కూడా మూడో స్థానానికి పడిపోయినట్లు గుర్తు చేశారు. భూస్వామి కుటుంబం నుండి వచ్చిన తూంకుంట నర్సారెడ్డి రాజకీయాల్లో ఆస్తులు, 100కు పైగా వ్యవసాయ పొలాలు కోల్పోగా, గజ్వేల్ లో కేసీఆర్ ను ఎదుర్కొంటూ ప్రతిక్షణం కార్యకర్తలకు అండగా ఉంటున్న ఆయనను టార్గెట్ చేస్తుండడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు పెద్దన్నలా వ్యవహరించాల్సిన మైనంపల్లి హన్మంతరావు కొంతమందిని వెంటేసుకుని తిరుగుతూ తన పరువు తీసుకుంటున్నట్లు విమర్శించారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలు కాకుండా స్వచ్ఛమైన రాజకీయం చేస్తే తాము ప్రోత్సహించే వారమని, కానీ ఆయనలో ఒక విధమైన అహంకారం, పెత్తందారి పోకడ కనిపిస్తున్నదని అన్నారు. కాగా నర్సారెడ్డితో పాటు ఇక్కడి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సొంత డబ్బు ఖర్చుపెట్టి పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తుండగా, తమపై పగబట్టిన మైనంపల్లి తన పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. అయితే సిద్ధిపేట జిల్లాలో కాంగ్రెస్ ప్రతిష్ఠ పెంచాల్సిన ఆయన అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ పార్టీని చేజేతులా భూస్థాపితం చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పార్టీ అభివృద్ధికి కలసివస్తే సహకరిస్తామని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ అడ్డంకిగా మారితే ఆయన వ్యవహరిస్తున్న తీరును అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొంటూ తాము నామినేటెడ్ పదవుల కోసం ఎవ్వరికి నయా పైసా ఇవ్వలేదని వారు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో వర్గల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సందీప్ రెడ్డి, మర్కూకు మండల అధ్యక్షులు కనకయ్య, జగదేవ్పూర్ మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి, గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, సీనియర్ నాయకులు సాజిద్ బేగ్, రవీందర్ గుప్తా, కుకునూరుపల్లి రవి, గుంటుకు శీను, గాడిపల్లి శీను, జంగం రమేష్ గౌడ్, అజ్గర్, జింక మల్లేశం, ఉదెం శ్రీనివాస్ రెడ్డి, కన్నాయాదవ్, అరుణ్, బాలు, అంజాత్ తోపాటు భారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బనకచర్ల అడ్డుకోలేని సీఎం

- బీఆర్ఎస్ నాయకులు
- ప్రాజెక్టునిర్మాణం వల్ల తెలంగాణకు తీవ్రనష్టం

(సిద్ధిపేట టౌన్, ది సిద్ధిపేట టైమ్స్): ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి నదిపై నిర్మించనున్న బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లనున్నదని సిద్ధిపేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ విమర్శించారు. చిన్నకోడూరులో గురువారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణకు నష్టం వాటిల్లే ప్రాజెక్టును ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించారు. రైతుల హక్కులు సాగునీటి ప్రాజెక్టులపై సరైన అవగాహన లేనందున కాంగ్రెస్ పార్టీ మాట్లాడలేకపోతున్నదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ గా పనిచేసిన సమయంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేసేవారని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరిపాలన కొనసాగించారని గుర్తు చేశారు. అంతర్గత ఒప్పందాల కారణంగానే తెలంగాణకు నష్టం వాటిల్లే బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని సీఎం రేవంత్ రెడ్డి అడ్డుకోలేకపోతున్నారని, ప్రాజెక్టులపై అవగాహన లేని రేవంత్ రెడ్డి అడ్డుకోకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై మాజీమంత్రి హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ తర్వాతే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించిందని చెప్పారు. ఇప్పుడేమి చేయాలో తెలియక తమ పార్టీపై విమర్శలకు దిగిందన్నారు. బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోకపోతే సీఎం రేవంత్ రెడ్డి చరిత్రలో 'చేతగాని దద్దమ్మ'గా మిగిలిపోతారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, విమర్శలు మానుకుని ప్రజల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పలువురు గ్రామస్థాయి నాయకులు, పిఎసిఎస్ చైర్మన్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవానికి తాకట్టు పెట్టొద్దు

బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే సహించమంటూ చిన్నకోడూరు బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ - "బనకచర్ల ప్రాజెక్టును ఆపమని అడిగిన వారిని తప్పుదోవ పట్టించడం సరికాదు. మీ చేతిలో శక్తి ఉంటే తెలంగాణకు అన్యాయం చేస్తున్న ఆ ప్రాజెక్టును ఆపండి. చేయలేకపోతే కనీసం ఒప్పుకోండి. సాగు, తాగునీటి కోసం మేము కూడా మీకు తోడుగా ఉంటాం" అని స్పష్టం చేశారు. తెలంగాణ ఆత్మగౌరవానికి కాపాడిన కేసీఆర్, హరీశ్ రావులపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు దగ్గర తెలంగాణ గౌరవాన్ని తాకట్టు పెట్టొద్దంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ పీఓ చైర్మన్ ఏలేటి వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు మందల రాఘవ రెడ్డి, మోసర్ల మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ జేరిపోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కలహాలతో ఆత్మహత్యాయత్నం తల్లీ, పిల్లలను కాపాడిన కానిస్టేబుల్

ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌కు సీపీ సన్మానం

(సిద్ధిపేట టౌన్, ది సిద్ధిపేట టైమ్స్): మనుషుల ప్రాణాలు కాపాడటమే నిజమైన సామాజిక సేవ అని మరొకసారి గుర్తు చేశారు సిద్ధిపేట ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్. కుటుంబ కలహాల కారణంగా పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకొని తనువు చాలించాలనుకున్న ఓ మహిళను మనోబలంతో కాపాడాడు. సిద్ధిపేట కోటిలింగాల దేవాలయం సమీపంలో నివసించే చిట్టాపురం శ్యామల (30) కుటుంబ కలహాల మధ్య తీవ్ర మనోవేదనకు లోనై, తన పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే తన పిల్లలతో కలిసి బుధవారం ఇంటి నుండి బయటకు వెళ్లింది. పాత బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తన పిల్లలతో కలిసి తిరుగుతున్న ఆ మహిళను గమనించిన ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ ఆమెను ఆపి మాట్లాడి విషయాన్ని పూర్తిగా తెలుసుకొని వెంటనే స్పందించారు. చావొక్కటే సమస్యకు పరిష్కారం కాదని ఆమెకు ధైర్యం చెప్పారు. జీవితంలో ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుందని ఆమెకు భరోసా కల్పించారు. తన భర్తకు ఫోన్ చేసి పిలిపించి అతనికి అప్పగిస్తామని చెప్పినా ఆమె నిరాకరించడంతో వెంటనే సిద్ధిపేట సఖి సెంటర్‌ను సంప్రదించి, ఆమెను పిల్లలతో కలిసి అక్కడికి తీసుకెళ్లి కౌన్సిలింగ్ అందేలా చేశారు. దీంతో ఆ మహిళ తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీస్ కమిషనర్ డా. బి. అనురాధ, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ సేవలను అభినందిస్తూ గురువారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేకంగా సన్మానించి, అతనికి నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ప్రతి పోలీసు విధుల్లో నిబద్ధతతో పాటు చుట్టూ జరుగుతున్న విషయాలను గమనిస్తూ, బాధలో ఉన్నవారికి మానవతా దృక్పథంతో సహాయం చేయాలని" సూచించారు. విధి నిర్వహణలో నిబద్ధత ఉన్న పోలీసులకు ఎప్పుడూ గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీ రవీందర్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్సై ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Editor, Printer, Publisher & Owner : L. Ravichandra, Published from : H.No.10-50,Subhashnagar Colony, Prashanthinagar, Siddipet, Dist. Siddipet - 502103
Printing at : Loka Graphics, H.No. 10-50, Subhashnagar Colony, Prashanthinagar, Siddipet, Dist. Siddipet - 502103. Editor : L. Ravichandra, Cell : 9491331533 RNI.APTEL/2012/52025